సాక్షి సూర్యాపేట

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



రైతుల ఆగ్రహం

తాలు పేరిట ధాన్యం కొనడం లేదని ఆగ్రహిస్తూ రైతులు శుక్రవారం పెద్దవూర మార్కెట్ యార్డు ఎదుట ధర్నా చేశారు.

- IIలో



13 కిలోల గంజాయి పట్టివేత

13 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకుడిని యాదగిరిగుట్ట మండల పరిధిలో పోలీసులు పట్టుకున్నారు.

- IIలో

గరిష్టం/కనిష్టం
39° / 26°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

ముస్లింలకు మంత్రి రంజాన్‌ శుభాకాంక్షలు



సూర్యాపేట: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అల్లాహ్ కరుణ చూపాలని కోరుకుంటున్నట్లు రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్‌ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణరాష్ట్ర ముస్లిం మైనారిటీ ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి రంజాన్‌ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులుగా సాగుతున్న ముస్లింల ఉపవాస దీక్షల ఆరాధన ఫలించే రోజే రంజాన్‌ పర్వదినమని పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తిరుమలగిరి(తుంగతుర్తి): ప్రతి ఒక్కరికీ గుండె పునఃనిర్మాణం (సీపీఆర్‌–కార్డియో పల్మోనరీ రీసస్‌టేషన్‌)పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గుండె పునఃనిర్మాణం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ ఎస్‌.రఘునందన్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, మున్సిపల్‌ కమిషనర్‌ దండు శ్రీనివాస్‌, వైద్య సిబ్బంది మల్లెల వందన, నాగరాజు, బిచ్చునాయక్‌, కైరూన్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో యూనియన్లను అనుమతించాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రాంబాబు

భానుపురి(సూర్యాపేట): కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా ఆర్టీసీలో యూనియన్ల కార్యకలాపాలకు అనుమతించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు డిమాండ్‌ చేశారు. శుక్రవారం సూర్యాపేట ఆర్టీసీ డిపోలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ప్రచురించిన కరపత్రాలను ఆర్టీసీ కార్మికులకు పంపిణీ చేసి మాట్లాడారు. మూడేళ్లుగా 7వేల మంది కార్మికులు తగ్గినా రోజు వారి కిలోమీటర్ల మాత్రం 2 లక్షలకు పెరిగాయన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని పక్కన పెట్టి 12 గంటల పని విధానాన్ని అమలు చేయడం దారుణమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌.శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, రవీందర్‌, ఆంజనేయులు, మల్లయ్య, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి ఏర్పాట్లు చేయాలి



అర్వపల్లి : సీతారాంపురం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి, నాగారం: తెలంగాణకు హరితహారంలో భాగంగా జూన్‌లో ఇరిగేషన్‌ భూముల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్‌, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్‌ అన్నారు. జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాల పరిధిలోని ఎస్సారెస్పీ 71 డీబీఎం కాలువ వెంట 21 కిలోమీటర్ల మేర బ్లాక్‌ ప్లాంటేషన్‌ చేపట్టడానికి వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు శుక్రవారం జాజిరెడ్డిగూడెం మండలం సీతారాంపురం, నాగారం మండలం ఫణిగిరి, మామిడిపల్లి గ్రామ శివారుల్లో ఎస్సారెస్పీ ప్రధాన కాలువ, ఉప కాలువల భూములను వారు పరిశీలించి మాట్లాడారు. కాలువల వెంట స్థలాన్ని గుర్తించి త్వరలో హద్దులు నిర్ధారించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఐఓ ప్రేమ్‌చంద్‌, ఇరిగేషన్‌ అధికారి శ్రీనివాసరావు, ఎస్సారెస్పీ డీఈఈ పిచ్చయ్య, నాగారం ఎంపీడీఓ జి.శోభారాణి, సర్పంచ్‌ గట్టు నర్సింహారావు పాల్గొన్నారు.

- నేడే రంజాన్‌





శనివారం జరుపుకోనున్న రంజాన్‌ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రం సమీపంలోని గాంధీ నగర్‌లో ముస్తాబైన ఈద్గా, వేసిన టెంట్లు

పోటెత్తిన ధాన్యం



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌ యార్డుకు వచ్చిన ధాన్యం

పేట మార్కెట్‌ నిండా ధాన్యం రాశులు

- ఒక్కరోజే 45,253 బస్తాల రాక
- వారం నుంచి భారీగా తీసుకొస్తున్న రైతులు
- మద్దతు ధర దక్కడం లేదని ఆవేదన

సూర్యాపేట: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం భారీగా తరలి వస్తోంది. ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి ఈ నెల మొదటి నుంచే జిల్లాలో కోతలు ప్రారంభం కావడంతో మార్కెట్‌కు ధాన్యం రాక షురూవైంది. శుక్రవారం 868 మంది రైతులు 45,253 వేల బస్తాల ధాన్యాన్ని తీసుకొచ్చారు. దీంతో మార్కెట్‌ అంతా ధాన్యం రాశులతో నిండిపోయింది.

ధాన్యం రాక ఇలా..

ఈ నెల 1వ తేదీన 4,419 బస్తాల ధాన్యం మార్కెట్‌కు వచ్చింది. అలాగే 3వ తేదీన 11,424 బస్తాలు, 4న 12,476 బస్తాలు, 6న 24,962 బస్తాలు, 8న 19,954, 10న 16,103 బస్తాలు, 11న 13,256 బస్తాలు, 12న 15,434 బస్తాలు, 13న 18,027 బస్తాలు, 15న 41,312 బస్తాలు, 17న 42,546, 18న 32,135, 19న 29,028 బస్తాల చొప్పున ధాన్యం వచ్చింది. అయితే గ్రామాల్లో ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు లేకపోవడంతో ఈనెల 15వ తేదీ నుంచి ధాన్యం రాక అధికంగా ఉంది.

ఇదే అదనుగా ధర తగ్గించి..

మార్కెట్‌కు భారీగా ధాన్యం వస్తుండడంతో ఇదే అదనుగా వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌ ప్రారంభం నుంచి ఏ ఒక్క రోజు.. ఏ ఒక్క రైతుకు మద్దతు ధర వచ్చిన దాఖలాలు లేవు. ఈ మార్కెట్‌లో రూ.1,750లకు మించి ఎక్కువ ధరను వ్యాపారులు పెట్టడం లేదు. అదీ కూడా ఒక్కరిద్దరు రైతులకు ఈ ధర చెల్లించి ఎక్కువ మంది రైతులకు రూ.1,400 నుంచి రూ.1,500 వరకు ధర చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో గత్యంతరం లేకపోవడంతో వ్యాపారులు అడిగినకాడికి ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందని మద్దతు ధర దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, కమీషన్‌దారులు, వ్యాపారులతో కుమ్మక్కై రైతులకు ధర రాకుండా అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. పేరుకు మార్కెట్‌లో ఈ–నామ్‌ విధానం అమలవుతున్న వ్యాపారులంతా ఏకమై రూ.1,750లకు మించి ధర ఎవరూ పెట్టడం లేదు. సూర్యాపేట మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతు రూ.600 నుంచి రూ.250 దాకా నష్టపోవాల్సి వస్తోంది.

మద్దతు ధర ఇస్తలేరు



మాది సూర్యాపేట మండలం. మా మండలంలో ధాన్యాన్ని కొనుగోళ్లు చేయడం లేదు. దీంతో సూర్యాపేట మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకొచ్చా. దా దాపు 70 బస్తాల ధాన్యాన్ని అమ్మాను. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,060 ఉంటే మార్కెట్‌లో కేవలం రూ.1,530లు మాత్రమే ఇచ్చారు. మద్దతు ధర కంటే చాలా తక్కువ ఇచ్చినా తప్పని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వచ్చింది.

– భాగ్యమ్మ, సూర్యాపేట మండలం

కొనుగోలు లక్ష్యం 7.04 లక్షల మెట్రిక్‌ టన్నులు

ఈ సీజన్‌లో 1,90,253 హెక్టార్లలో వరి సాగు కాగా 12,72,705 మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి వస్తదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 7,04,415 మెట్రిక్‌ టన్నుల ధాన్య సేకరించాలని నిర్ణయించారు. ఇందుకు సెర్ప్‌ ఆధ్వర్యంలో 180, పీఏసీఎస్‌ల ద్వారా 113 మొత్తం 293 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిచాలని నిర్ణయించగా నేటి వరకు 278 కేంద్రాలను ప్రారంభిచారు. ఇందులో 92 కేంద్రా ద్వారా కొనుగోలు ప్రారంభం కాగా సెర్ప్‌ కేంద్రాల ద్వారా 3,486 మెట్రిక్‌ టన్నులు, పీఏపీఎస్‌ల ద్వారా 3,085 మెట్రిక్‌ టన్నులతో కలిపి మొత్తం 6,571 మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ధాన్యం విలువ 13.53 కోట్లు ఉంటుంది. జిల్లాలో ఏప్రిల్‌ మొదటి నుంచి వరి కోతలు ప్రారంభం కాగా వారం క్రితం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతి వచ్చింది.

పబ్లిక్‌ క్లబ్‌ కీర్తి పెంచేలా అభివృద్ధి

- విద్యుత్‌ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి(సూర్యాపేట): సూర్యాపేట పబ్లిక్‌ క్లబ్‌ కీర్తిని మరింత పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌ క్లబ్‌లో క్యాంటీన్‌ పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు పునర్నిర్మించిన షటిల్‌ కోర్టు, ధ్యానయోగా శిక్షణ కేంద్రం, ఆర్వో వాటర్‌ ప్లాంట్‌, చలివేంద్రం, హోమ్‌ థియేటర్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్‌ కార్యవర్గం సభ్యులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ గోపగాని వెంకటనారాయణగౌడ్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ అన్నపూర్ణ, వైస్‌ చైర్మన్‌ పుట్టా కిశోర్‌, పబ్లిక్‌ క్లబ్‌ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి గణేష్‌, ఉపాధ్యక్షుడు పెండెం చంద్రశేఖర్‌, జాయింట్‌ సెక్రటరీ డివి.శ్రీనివాస్‌, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్‌ క్లబ్‌లో షటిల్‌ ఆడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం

- జెడ్పీ సీఈఓ సురేష్‌

నేరేడుచర్ల: ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామని జెడ్పీ సీఈఓ సురేష్‌ అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి నివారణకు మండలాల వారీగా మిషన్‌ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, ఏయే గ్రామాల్లో నీటి ఎద్దడి ఎక్కడ ఉందో నివేదికలను రూపొందించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 392 ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నట్టు గుర్తించి 314 ప్రాంతాల సమస్యను పరిష్కరించామన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో మంచినీటి సమస్యపైనే ఎక్కువగా చర్చిస్తామన్నారు. మండల పరిషత్‌ సమావేశాలకు హాజరుకాని అధికారుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధి హామీ కింద కూలీలకు ఎక్కువ పనిగంటల కల్పించేందుకు ప్రతి మండలానికి 10 చొప్పున చేపల పెంపకానికి ట్యాంకుల నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని చిల్లేపల్లి గ్రామంలోని నర్సరీలను పరిశీలించి మొక్కలను నీటిని పోశారు. ఈ సమావేశంలో ఎంపీపీ లకుమళ్ల జ్యోతిభిక్షం, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మున్సిపల్‌ చైర్మన్‌ చందమళ్ల జయబాబు, వైస్‌ చైర్మన్‌ చల్లా శ్రీలతారెడ్డి, ఎంపీడీఓ శంకరయ్య, ఎంఈఓ చత్రునాయక్‌, ఎంపీఓ విజయకుమారి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

జియో ట్రూ 5జీ సేవలు ప్రారంభం



సూర్యాపేటలో జియో 5జీ సేవల ప్రారంభోత్సవంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌

సూర్యాపేట: జిల్లాకేంద్రంలో రిలయన్స్‌ జియో ట్రూ 5జీ సేవలను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌ శుక్రవారం ప్రారంభించారు. ఈ సేవల ప్రారంభంతో జియో వినియోగదారులకు జియో వెల్కం ఆఫర్‌ ఆహ్వానం అందుతుందని, అదనపు ఖర్చు లేకుండా 1 జీబీపీఎస్‌ + వేగంతో అపరిమిత 5జీ డేటాను పొందవచ్చని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ నిమ్మల శ్రీనివాస్‌ గౌడ్‌, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాల్‌ అమ్మవారిని వజ్ర వైఢూర్యాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. అనంతరం ఆలయ మాఢ, తిరువీధిలో సేవోత్సవం, అద్దాల మండపంలో ఊంజలి సేవ నిర్వహించారు. ఇక శ్రీస్వామి వారికి సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అర్చనలు, అభిషేకం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు చేపట్టారు. దేవస్థానంలో వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.15,18,847 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

భారతదేశం.. సర్వమతాల సమ్మిళితం

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు: సర్వమతాల సమ్మిళితం మన భారతదేశం.. కానీ ప్రస్తుత రాజకీయాలు మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్నాయని నల్లగొండ ఎంపీ ఎన్‌.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో రంజాన్‌ మాసం చివరి రోజున ముస్లిం పెద్దలు, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు గ్రామస్తులతో కలిసి మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందుకు హాజరై మాట్లాడారు. ఇఫ్తార్‌ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అన్ని మతాలవారు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. అందరికీ రంజాన్‌ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకుంటూ చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ముస్లింలు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈద్గా, ఖబరస్తాన్‌ భూములు ఆక్రమణలకు గురయ్యాని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ వెంటనే ఈద్గా నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అక్రమణకు గురైన భూములపై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా గోపాల్‌, ఎంపీటీసీ ఉపేందర్‌, కాంగ్రెస్‌ పార్టీ నేరేడుచర్ల మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు ప్రకాష్‌, జితేందర్‌రెడ్డి, నర్సింహారావు, నాగయ్య, ముస్లిం పెద్దలు కాశిం, పాషా, జైన్‌లా, ముజ్జు, వాజిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

26న జాబ్‌మేళా

దురాజ్‌పల్లి(సూర్యాపేట): జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్‌ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్‌ సిటీ డెవలపర్స్‌ ప్రైవేట్‌ కంపెనీలో మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్స్‌ 300 ఖాళీలు, అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్‌, ట్రైనీ ఫార్మాసిస్ట్‌, రిటైల్‌ ట్రైనీ అసోసియేట్‌, ప్రొడక్ట్‌ అడ్వైజర్‌, ఫార్మసీ ట్రైనీలు మొత్తం 225 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగులు ఉదయం 11 గంటలకు ఒరిజినల్‌ సర్టిఫికెట్స్‌, ఒకసెట్‌ జిరాక్స్‌, ఆధార్‌ కార్డులతో జిల్లా కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు అర్బన్‌ సిటీ డెవలపర్స్‌ మేనేజర్‌ సెల్‌ 9573381973, అపోలో ఫార్మసీ మేనేజర్‌ 7995389260, 9989967088లను సంప్రదించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం అనంతరం కల్యాణం నిర్వహించారు. చివరగా నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌ కుమార్‌, ఈఓ నవీన్‌, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- చిన్నారి గ్రాడ్యుయేట్లు



జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం -2లో శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌ డేలో పాల్గొన్న, తుంగతుర్తి ఐసీడీఎస్‌ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీజ, టీచర్‌ అంజమ్మ, తల్లులు, చిన్నారులు

ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు

- మొదటి విడతగా జిల్లాకు చేరిన 57,300 బుక్స్‌
- పాఠశాలల పునఃప్రారంభం రోజే పంపిణీ చేసేలా చర్యలు
- మరో పది రోజుల్లో రానున్న మరికొన్ని..
- జిల్లా వ్యాప్తంగా 63,805 మంది విద్యార్థులు



జిల్లా కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు

చిలుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా సకాలంలో పాఠ్యపుస్తకాలు అందక విద్యా బోధనపై ప్రభావం పడేది. విడతల వారీగా పంపిణీ చేయడంతో ఒక్క పుస్తకాన్ని ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కలిసి చదువుకునే వారు. ఈ సమస్యను అధిగమించేందుకు 2023–24 విద్యా సంవత్సరంలో ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా కేంద్రాలకు కార్గో బస్సుల ద్వారా సరఫరా చేస్తోంది. జిల్లాకు వచ్చిన పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రంలోని గోదాములో నిల్వ చేస్తున్నారు.

తొలి విడతగా..

జిల్లాలో ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్‌ పాఠశాలలు 941 ఉండగా, కేజీబీవీలు 18, ఆదర్శ పాఠశాలలు 9 మొత్తంగా 968 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 63,805 మంది విద్యార్థులు ఉండగా, 5,79,090 పాఠ్యపుస్తకాలు అవసరం ఉన్నాయి. ఈ మేరకు జిల్లాకు మొదటి విడతగా 57,300 పుస్తకాలు వచ్చాయి. మరికొన్ని పుస్తకాలు మరో పది రోజుల్లో గోదాముకు వచ్చే అవకాశం ఉంది.

ఇంగ్లిష్‌ మీడియంతో గతేడాది ఇబ్బందులు..

2022–23 విద్యాసంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్‌ మీడియం ప్రారంభించారు. పుస్తకాలు ముద్రించడం, అవి సరఫరా కావడం ఆలస్యం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. దీనికి తోడు 2020 నుంచి కోవిడ్‌ ప్రభావంతో పూర్తి స్థాయిలో పుస్తకాలు ఇవ్వలేదు. గతేడాది నవంబర్‌ వరకు పుస్తకాలు పంపిణీ కొనసాగింది. ఈసారి యంత్రాంగం ముందుగానే మేల్కొంది. విద్యాసంవత్సరం ప్రారంభ రోజునే పుస్తకాలు పంపిణీ జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పారదర్శకంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో సరఫరా చేసే పుస్తకాలు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. కిందస్థాయి సిబ్బంది కొందరు బహిరంగా మార్కెట్‌కు తరలించి, విక్రయించి సొమ్ము చేసుకోకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతి పుస్తకానికి వరుస సంఖ్య క్యూఆర్‌ కోడ్‌ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆయా పాఠశాలలకు సరఫరా చేసే పుస్తకాల వివరాలను డీఈఓ కార్యాలయంలో ప్రత్యేక రిజిస్టర్లు ఏర్పాటు చేసి నమోదు చేస్తున్నారు. ఏ రోజు ఎన్ని పుస్తకాలు వచ్చాయో పొందుపరుస్తున్నారు.

జూన్‌ 12 నాటికి పూర్తి స్థాయిలో పంపిణీ



వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల విషయంలో ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తరగతులు ప్రారంభించిన రోజునే పుస్తకాలు అందజేస్తాం. జూన్‌ 12 నాటికి పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు తెప్పిస్తాం. ఇప్పటికే కొన్ని పుస్తకాలు వచ్చాయి. మిగిలినవి త్వరలో వస్తాయి.

– అశోక్‌, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



అంజయ్య (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన కీత అంజయ్య(46) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కీతవారిగూడెం గ్రామానికి చెందిన కీత అంజయ్య ఈనెల 17న గ్రామ శివారులో వాకింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్యకు తలకు, కుడి కాలుకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బంధువు కీత రామనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మృతి



బాలయ్య (ఫైల్)

మోటకొండూర్: చేపలు పట్టేందుకుగాను తెప్పలో చెరువులోకి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి బాలయ్య(58) గురువారం చెరువులో చేపలు పట్టేందుకు తెప్పలో వెళ్లాడు. ఎండకు ఆయాసం కావటంతో ఒడ్డు చేరుకోగానే కింద పడిపోయాడు. దీంతో ఆయనను ఆలేరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు శుక్రవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు.

తుర్కపల్లిలో చోరీ

తుర్కపల్లి: వృద్ధురాలి మెడలోని బంగారు గుండ్లు గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గిరి రంగమ్మ తన కుమార్తె ఇంటికి వచ్చి కొన్నిరోజులుగా ఇక్కడే ఉంటుంది. శుక్రవారం గ్రామంలో సంత కావడంతో కుమార్తె సత్తెమ్మ కూరగాయలు అమ్మడానికి సంతకు వెళ్లింది. ఈ క్రమంలో సుమారు 7గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి మంచినీరు అడిగాడు. ఆమె నీరు తెచ్చి ఇవ్వగానే రంగమ్మ మెడలో మెడలో ఉన్న తులంన్నర బంగారు గుండ్లను లాక్కొని వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

భూదాన్‌పోచంపల్లి: పీవీసీ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఆరుగురు ఒడిశా వలస కార్మికులపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిని పోలీసులు రిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరి గ్రామ సమీపంలో పీవీసీ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఆరుగురు ఒడిశా వలస కార్మికులను బుధవారం ఇటుక బట్టీల యజమాని పోక వెంకటకిరణ్, సురేశ్‌లు దాడి చేసి గాయపరిచారు. ఈమేరకు వారిని అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం భువనగిరి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

సెలవులొచ్చాయ్..

2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కావడంతో హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. సెలవులు 25వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నా.. 21 ఐచ్ఛిక సెలవు, 22న రంజాన్, 23న ఆదివారం ఉండడంతో హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు మూడు రోజుల ముందుగానే వసతి గృహాలను ఖాళీ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రిభువనగిరి



తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న విద్యార్థులు







గురుకుల హాస్టల్ నుంచి సామగ్రితో స్వస్థలాలకు వెళ్తున్న విద్యార్థులు

ధాన్యం కొనకపోవడంతో రైతుల ఆగ్రహం



పెద్దవూరలో రాస్తారోకో చేస్తున్న రైతులు



రైతుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్న ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి

- పెద్దవూరలోని జడ్చర్ల– కోదాడ హైవేపై రాస్తారోకో

పెద్దవూర: తాలు పేరిట వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు ఎదుట జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. లారీలు తెప్పించటంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలు గ్రామాల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించక ముందే ఇరవై రోజుల క్రితం వరి ధాన్యాన్ని పెద్దవూర సబ్ మార్కెట్‌లో పోశామని తెలిపారు. ఈ నెల 17న ఎమ్మెల్యే నోముల భగత్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 20న అధికారులు వచ్చి ధాన్యంలో తేమ శాతం చూశారని, మ్యాచర్ సరిగ్గా వచ్చినప్పటికీ ధాన్యంలో తాలు ఉందని బస్తాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వద్ద సైతం తాలు చూసే పరికరాలు లేవని, అయినా తాలు ఉందని ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రంలో సుమారు 80కి పైగా ధాన్యం రాశులు ఉంటే అందులో 60కి పైగా తాలు ఉందన్న సాకుతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ఖాళీ బస్తాతో పాటు బస్తాకు 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41.200 కిలోలు తూకం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఉన్నతాధికారులు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చేదాకా రాస్తారోకోను విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి వచ్చి రైతులతో తహసీల్దార్‌తో మాట్లాడించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, రైతులు మోహన్‌రెడ్డి, కంచర్ల రేణుక, వడ్డేపల్లి వెంకట్‌రెడ్డి, మంచికంటి అనిత, కంచర్ల సైదిరెడ్డి, మాధవరెడ్డి, అశోక్, లక్ష్మమ్మ, కల్లూరి మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జానారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి, గోవర్ధన్‌రెడ్డి, అలివేలు, జనార్దన్ రెడ్డి, వెంకటయ్య, లాలయ్య, భార్గవరెడ్డి, చిరంజీవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఉన్నతాధికారుల ఆదేశానుసారం శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేపటి నుంచి ధాన్యానికి సరిపడా లారీలు వచ్చేలా చూస్తామని, తాలు పట్టే యంత్రాలను తెప్పిస్తామని, ఏరోజుకు ఆరోజు కొనుగోలు చేసి కాంటాలు వేస్తామని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి సందీప్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

- అకాల వర్షం.. తడిసిన ధాన్యం



శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నల్లగొండ శివారులోని కంచనపల్లి ఐకేపీ సెంటర్‌లో కొట్టుకుపోతున్న ధాన్యం



కంచనపల్లి ఐకేపీ సెంటర్‌లో బురదలో ధాన్యం



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో..

13 కిలోల గంజాయి పట్టివేత



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: 13 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకుడిని ఎల్‌బీనగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన హైదరాబాద్– వరంగల్ ప్రధాన జాతీయ రహదారిలో యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట గ్రామ స్టేజీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం తెనుగువాడ గ్రామానికి చెందిన నెన్నాల మహేష్, భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన మెట్ట రంజిత్‌లు ఇద్దరూ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని ద్విచక్ర వాహనం మీద తరలిస్తున్నారు. దీంతో పక్కా సమాచారం అందుకున్న ఎస్వోటీ పోలీసులు ఎన్‌హెచ్ 163 ప్రధాన జాతీయ రహదారిలోని యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామం స్టేజీ పరిధిలో వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా, బైక్ పై ప్రయాణిస్తున్న ఇద్దరిలో మెట్ట రంజిత్ పారిపోగా.. నెన్నాల మహేష్ పట్టుబడ్డాడు. దీంతో అతడి బైక్‌ను తనిఖీ చేయగా 13 కిలోల గంజాయి లభించింది. అతడి వద్ద సెల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా.. పట్టుబడిన యువకుడు ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ అని, సేల్స్ చేసేవాడు పారిపోయాడని ఎస్వోటీ పోలీసులు తెలిపారు. నిందితుడిని యాదగిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ రావు తెలిపారు.

మానవ మృగానికి 20 ఏళ్ల జైలు

చివ్వెంల(సూర్యాపేట): మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత శుక్రవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ ఆస్పత్రి వద్ద ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లలో ఓ మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. ఆమె భర్త 10 సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఈమె ప్రతిరోజు కూలి పనికి వెళ్తుంది. ఈ క్రమంలో పని ప్రదేశంలో చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన భానోతు శ్రీనుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆమెను రెండో వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమెతో కలిసి అదే ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆరో తరగతి వరకు చదివి ఇంట్లో ఉంటూ తల్లితో అప్పుడప్పుడు పనికి వెళ్తున్న ఆమె కూతురిపై శ్రీను కన్ను పడింది. ప్రతిరోజు తల్లి పనికి వెళ్లగానే బాలికను లైంగికంగా వేధించేవాడు. 1–12–2019న ఇంట్లో ఎవరు లేని సమయంలో సాయంత్రం బాలికను ఇంట్లోకి బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. తిరిగి మరుసటి రోజు అత్యాచారం చేయబోగా బాలిక కేకలు వేసింది. దీంతో అతను పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి జరిగిన విషయాన్ని చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కె.శివశంకర్ నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ త్యాగరాజన్ వాదనలతో ఏకీభవిస్తూ నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.7 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేశారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కానిస్టేబుల్ కృష్ణ సహకరించారు.

ఉపాధిహామీ కార్మికుడికి గాయాలు

మద్దిరాల: మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనిచేసే క్రమంలో కార్మికుడికి గాయాలయ్యాయి. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన బెజ్జంకి చంద్రారెడ్డి రోజు మాదిరిగానే శుక్రవారం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. అక్కడ పని చేసే క్రమంలో రోడ్డు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా గాయాలు కావడంతో సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. చంద్రారెడ్డి కాలు ఫ్యాక్చర్ అయినట్లు ఏపీఓ గుండు వెంకన్న తెలిపారు.

యుగంధర్‌కు అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న యుగంధర్

వలిగొండ: మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పోలేపాక యుగంధర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మదర్ ఫౌండేషన్, మెగాసిటీ నవకళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ భాను ప్రసాద్ రావు, డాక్టర్ ఆశిష్ చౌహాన్, ప్రముఖ హైకోర్ట్ న్యాయవాది రాపోలు భాస్కర్ నేత, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, డాక్టర్ ఏవీ స్వామి, కంచర్ల ఈశ్వర్ చారి, మల్లికార్జున్ రావు, రాఘవ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

లారీకి తగిలిన విద్యుత్ తీగలు

- కూలిన విద్యుత్ స్తంభాలు



కూలిన విద్యుత్ స్తంభం

మోత్కూరు: కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ విద్యుత్ తీగలకు తగలడంతో ట్రాన్స్‌ఫార్మర్, రెండు స్తంభాలు కూలిపోయాయి. ఈ సంఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర దేవాలయానికి ఎదురుగా మెయిన్ రోడ్డు వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టె లోడ్‌తో హాలియా నుంచి బయలుదేరి మోత్కూరు మీదుగా ఆదిలా బాద్, సిరిపూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా.. మో త్కూరులో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఎదురుగా మెయిన్ రోడ్డులో లారీకి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్, రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. శుక్రవారం సాయంత్రం అధికారులు, సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

మెడిసిన్ నిల్వచేసినందుకు ఇద్దరికి మూడేళ్ల శిక్ష

భువనగిరి: లైసెన్స్ లేకుండా మెడిసిన్‌కు సంబంధించిన మందులు నిల్వ చేసిన నిందితులకు 3 సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి దశరథ రామయ్య శుక్రవారం తీర్పు వెల్లడించారు. భువనగిరిలో ఏ ఎట్టిబాబు, ఏ జ్యోతి మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. అనుమతి లేకుండా పట్టణంలో మనోహార్ నివాసంలో మందులు నిల్వ చేశారు. ఈక్రమంలో 2013లో అప్పటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవిందసింగ్, శ్రీకాంత్‌కు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మెడిసిన్ నిల్వ చేయడంతో కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేశారు. శుక్రవారం కోర్టులో విచారణ సందర్భంగా సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడంతో నిబంధనలకు విరుద్ధంగా మందులు నిల్వ చేసినట్లు రుజువు కావడంతో ఇద్దరికి 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 20వేలు జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు ప్రస్తుత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ తెలిపారు.

పిడుగు పడి తాటిచెట్టు దగ్ధం

మునుగోడు: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. మునుగోడు గ్రామ శివారులోని కంఠ మహేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని ఓ తాటి చెట్టుపై పిడుగు పడింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాగా.. కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

ప్రజలను చైతన్యం చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ రాజకీయ లబ్ధి పొందుతోందని, దీనిపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్సిన ఆవశ్యకత కమ్యునిస్టులపై ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షణాది రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోందని.. దాన్ని ప్రజాస్వామ్య వాదులంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసురేరావాలనే ఎత్తుగడతో ముందుకు సాగుతున్న తీరును వివరించారు. దేశంలో ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని, కేరళ ప్రభుత్వం ఆ దిశగా ముందుకు వెళ్తోందని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, సీతారాములు, మంగారెడ్డి, జగదీష్‌చంద్ర, గోవిందరెడ్డి, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధమవ్వండిలా..

- గుర్రంపోడు ఏఓ మాధవరెడ్డి



కంచర్ల మాధవరెడ్డి
వ్యవసాయాధికారి, గుర్రంపోడు

పాడి పంట

గుర్రంపోడు : వేసవిలో అడపాదడపా కురిసే వర్షాలను వినియోగించుకుని ముందస్తుగా రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటకు అనువైన నల్లరేగడి భూముల్లో వేసవి దుక్కులను రైతులు చేపడుతున్నారు. వేసవి దుక్కులు, భూసార పరీక్షలు, నేల స్వభావాన్ని బట్టి పంటల సాగు ఇతర సాగు విధానాలపై రైతులు మెళకువలు, అవగాహన కల్గి ఉండాలని, వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయాధికారి కె.మాధవరెడ్డి సూచిస్తున్నారు.



కొప్పోలులో వేసవి దుక్కులు

లోతు దుక్కులతో మేలు

లోతు దుక్కులు దున్నినప్పుడు భూమిలో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేసే అవకాశం ఉంటుంది. భూమిలో దాగి ఉన్న లేదా నిద్రావస్థలో ఉన్న పురుగులు, తెగుళ్లను కలుగ జేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకి నశిస్తాయి. దుక్కిలో బయట పడిన గుడ్లు, ప్యూపాలను పక్షులు తిని నాశనం చేస్తాయి. కాబట్టి తొలకరిలో వేసే పైర్లకు వీటి తాకిడి తగ్గడానికి అవకాశం ఉంటుంది. భూమిలో 9 అంగుళాల వరకు లోతు తగ్గకుండా దుక్కులు దున్నుకోవడం శ్రేయస్కరం.

పంట మార్పిడి తప్పనిసరి

భూమిలో ఏటా పంట మార్పిడి చేసుకోవాలి. రైతులు ఒకే రకమైన పంటను వరుసగా సాగు చేస్తూ దిగుబడులు రాక నష్టపోతున్నారు. ఒకే పంటను ఏళ్ల తరబడి పండించడం వల్ల చీడపీడలకు ఎప్పుడూ ఆహారం సమృద్ధిగా లభించి అవి వృద్ధి చెందుతాయి. ఆ పంట వేర్లు వ్యాపించిన మేర భూమి పొరలు నిస్సారమవుతాయి. పంట మార్పిడి నేలసారాన్ని కాపాడుకోవడంతోపాటు తేమను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. వివిధ రకాల వేరు వ్యవస్థలు కలిగి భిన్నంగా పెరిగే పైర్లను పంట మార్పిడి కోసం ఎంపిక చేసుకోవాలి. పత్తి, ఆముదం , పొద్దు తిరుగుడు వంటి పైర్లు నేల లోపలి నుంచి పోషకాలు తీసుకుంటాయి. పోషకాలు ఎక్కువగా తీసుకునే నువ్వులు , పొద్దు తిరుగుడు వంటి పంటలకు భూమికి పోషకాలు సమకూర్చే అవసరాల పైర్లతో పంట మార్పిడి చేసుకోవాలి. ఇవి బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయి. వరుసగా పప్పుదాన్యాల పంటలు కాకుండా నూనె పంటలు సాగు చేయాలి. మిరప, టమాట, వేరుశనగ, పంటలను ఆశించే లద్దె పురుగు నివారణకు జొన్న, సజ్జ, రాగి పంటల ఎర పంటలుగా వేసుకోవాలి. టమాట, మిరుప, పుచ్చ పంటల్లో బంతిని కూడా వేరే పంటగా కొన్నిసాళ్లు వేసుకుని తెగుళ్లు, ఆకుముడత నివారించవచ్చు.మార్పిడి చేసేటప్పుడు అనుకూలమైన పంటలు ఎంచుకోకపోతే చీడపీడల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. బెండ తర్వాత ప్రత్తి వేయకూడదు.జొన్న సాగు చేసిన వెంటనే మిరప వేయకూడదు. ఈ పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశించి నష్ట పరుస్తాయి.

లోతు దుక్కులతో కలుపు నిర్మూలన

తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు పొలాల్లో పెరిగి పంటలు నాశనం చేస్తాయి. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి సత్తువ లేకుండా చేస్తాయి. దీనివల్ల భూసారం తగ్గడమే కాకుండా భూమిలోని లోతైన పొరల్లో తేమ తగ్గుతుంది. తుంగ, గరికల వేర్లు దుబ్బుగా ఉండి నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ కష్టం అవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు వేర్లు , దుంపలు ఏరి వీటిని అరికట్టవచ్చు. వేసవిలో లోతుగా దున్ని తొలకరి వర్షాలకు గొర్రు, గుంటులతో దున్నినప్పుడు నేల బాగా గుల్ల బారుతుంది. పైర్ల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేలకోతకు గురికాకుండా వాలుకు అడ్డంగా దున్నడం, వర్షపు నీటికి ప్రవాహానికి అడ్డంగా చిన్నపాటి మట్టి, రాతి కట్టడాలు ఏర్పాటు చేసుకోవాలి. పత్తి, కంది, ఆముదం కట్టెలను తొలగించి పొలంలోనే కాల్చివేయాలి. పొలంలో గట్టిపొర ఏర్పడితే ఎర్రని ఇసుక మట్టిని తోలడం వల్ల భూమి బాగుపడుతుంది. వేసిన పంట నుంచి వేర్లు సులభంగా భూమిలోకి దిగుతాయి. వేసవిలోనే సేంద్రియ ఎరువులు పంట పొలాలకు తరలించుకోవాలి. నీటి లభ్యత ఉన్న రైతులు పెంట కుప్పలపై నీటిని అడపదడపా చిలుకరించడం వల్ల తొందరగా ఎరువుగా మారుతుంది. కుళ్లిని సేంద్రియ ఎరువులు వర్షాధార పంటల్లో త్వరగా బెట్ట పరిస్థితులను కల్గిస్తాయి.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు

రైతులు ముఖ్యంగా పండ్లతోటలు సాగ చేసే రైతులు భూసార పరీక్షలు చేయించి పంటలు సాగు చేసుకోవాలి. లేకపోతే ఐదేళ్ల వరకు పెంచి కాపు కొచ్చే దశలోనే క్షీణించి రైతుకు పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంది. భూసార పరీక్షలు ద్వారా తమ నేల ఏ పంటలకు అనుకూలమో నిర్ధారించుకోవాలి.